

138 మే డే సందర్భంగా చిలకలగూడ చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ నేతలు



హైదరాబాద్ వార్త

### కార్మికులు ఐక్యంగా ఉన్నపుడే..
## డిమాండ్లు నెరవేరుతాయి

సికింద్రాబాద్, మే 1 ప్రభాతవార్త : కార్మికులు ఐక్యంగా ఉన్నపుడే కార్మికులు డిమాండ్‌లు నెరవేర్చుకోగలుగుతామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఉమర్‌ఖాన్ అన్నారు. 138 మే డే సందర్భంగా చిలకలగూడ చౌరస్తాతో పాటు పలు ప్రాంతాలలో జెండాలను ఆవిష్కరించి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమర్‌ఖాన్ మాట్లాడుతూ కార్మికులు, ముఖ్యంగా ఆటో కార్మికులు రోజువారి ఖర్చులకోసం నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆటోల కిరాయిలు కట్టలేక, కుటుంబాన్ని పోషించుకోలేక అవస్థలు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాని డిమాండ్ చేశారు. నెలల కాలంగా ఇబ్బందులు పడుతున్నా ఒకవైపు ట్రాఫిక్ అధికారులు, మరోవైపు పోలీసులు కూడా కేసులు రాస్తూ మరింత ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. తమ డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె లతీస్, హరిదర్శన్, ఎండీ ఆరీఫ్, ఎండీ గౌస్, ఎస్.లక్ష్మణ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

### బైక్‌ను ఢీకొట్టిన కళాశాల బస్సు..
## విద్యార్థి దుర్మరణం

దుండిగల్, మే 1 ప్రభాతవార్త: కళాశాల బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో విద్యార్థి మృతిచెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కర్ణాటకలోని బీదర్‌కు ప్రాంతానికి చెందిన నాగేష్ కుమారుడు శివానంద్(22) మేడ్చల్ పరిధి కండ్లకోయలోని సిఎంఆర్ కళాశాలలో ఎంబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి బీరంగూడలో వారి స్వంత ఇంట్లో తల్లి, సోదరుడితో పాటు ఉంటూ కళాశాలకు వెళ్తుండేవాడు. రోజుమాదిరిగానే బుధవారం ఉదయం తన బైక్‌పై కళాశాలకు వెళ్ళిన శివానంద్ సాయంత్రం ఇంటికి బయలుదేరాడు. ఔటర్‌రింగురోడ్డు సర్వీస్‌రోడ్డులో వెళ్తుండగా దుండిగల్ డబుల్‌బెడ్‌రూమ్స్ క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఎమ్మెల్లార్‌ఐటి కళాశాల బస్సు శివానంద్ బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో తలకు తీవ్రగాయాలవడంతో శివానంద్ అక్కడి కక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# నేరాల నియంత్రణలో ఏదీ పురోగతి?

## ప్రాణమంటే విలువలేదు.. లెక్కలేదు.. చిన్న తగాదాలకే ఇంత దారుణమా..?

- ✦ హత్యలతో అట్టుడుకుతున్న పలు ప్రాంతాలు
- ✦ స్వల్ప కారణాలకే ప్రాణాలు తీస్తున్నారు ✦ ప్రజలను బెంబేలెత్తిస్తున్న వరుస ఘటనలు
- ✦ వస్తువు కోసం ప్రాణం తీయడం.. వంట కోసం ప్రాణం తీయడం ఎంత దారుణం
- ✦ ఎంతోదూరం నుంచి జీవనోపాధికి వచ్చి స్వల్ప సమస్యలకు ప్రాణాలు తీసుకుంటున్నారు

**జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రం నుంచి నగరానికి వలస వచ్చిన ఒక కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. వంట ఆలస్యమవ్వడంపై ఇద్దరు దంపతుల మధ్య గొడవ తలెత్తడంతో, క్షణికావేశానికి లోనైన భర్త ఇటుకతో భార్య తలపై కొట్టగా, ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ కేసులో రవీనా దుబే, నవీన్ దుర్వే దంపతులకు ఇద్దరు కూతుళ్ళు, ఏడాది వయసు గల ఒక కొడుకు ఉన్నారని పోలీసులు తెలిపారు. కూతుళ్ళను స్వగ్రామంలో ఉంచి బాబుతో నగరానికి వచ్చినప్పుడు, నిందితుడు ఆచి తూచి వ్యవహరించకుండా వంట ఆలస్యమనే సాకుతో భార్యను హత్య చేసి తమ జీవితాలనే తల్లకిందులు చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. క్షణికావేశంలో చేతికేది దొరికితే దానితో దాడికి దిగడం వల్ల తెలియకుండానే సామాన్యులు హత్యా వలయంలో ఇరుక్కుపోతారని పోలీసు శాఖవారు పేర్కొన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా విచక్షణతో ఆలోచించాల్సిన అవసరం ఉందని నేరాల అవగాహనపై తమ ప్రచార కార్యక్రమంలో భాగంగా సామాన్యులకు సూచించారు.**

హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త: నైట్ షిఫ్టు నుండి ఒంటరిగా ఇళ్ళకు వెళ్ళే ప్రైవేటు ఉద్యోగుల నుంచీ, పనులు ముగించుకుని ఆలస్యంగా ఇళ్ళకు చేరుకునే ఇతర సామాన్యులను అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖ హెచ్చరించింది. నగరంలో వివిధ రకాల నేరాలమీద ప్రజలందరికీ అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టిన పోలీసులు అందులో భాగంగా రోజూవారీ నేరాల మీద అధ్యయనం చేపట్టారు. ఇటీవలె జరిగిన సైబర్ నేరాలలో అనుమానాస్పద పార్శిల్‌తో ఆరంభించి ముంబయ్ పోలీసులు పేరుతో జరిగే మోసాలు పెచ్చుమీరిపోయాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి సైబర్ నేరాలు గత నెలలోనే వందకు పైగా జరిగాయని పోలీసులు స్పష్టం చేశారు. హైదరాబాద్ వాసులు వివిధ నేరాలపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. డబ్బు పోయేలా, లేదా ప్రణం మీదకు వచ్చేలాగ., పరిస్థితి ఎలాంటిదైనా గానీ నేరం జరిగే అవకాశం ఉందనిపిస్తే సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ అప్రమత్తమవ్వాలని సూచించారు.

**వస్తువు కోసం ప్రాణం తీశాడు..** తమ స్నేహితుడిని హత్య చేసినందుకు ఒక వ్యక్తిని పగతో వెంటాడి చంపిన ఇద్దరు, ఆ రక్తపాతాన్ని సామాజిక మాధ్యమంలో పొందు పరిచిన ఘోరమైన సంఘటనని నగరవాసులు మరువక ముందే మరిన్ని హత్యలు చోటు చేసుకుంటున్నాయి. వాటిలో అత్యంత అల్పమైన కారణంతో ఒక వ్యక్తి నిండు ప్రాణాన్ని బలితీసుకున్న ఘటన ఇటీవలె గుడిమల్కాపూర్ ప్రాంతంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే, సనాఉల్లా(24) అనే యువకుడు గుడిమల్కాపూర్ రింగు రోడ్డు పిల్లర్ నెంబర్ 65 వద్ద అర్థరాత్రి సమయంలో నడుచుకుంటూ వెళ్తుండగా, ద్విచక్రవాహనం పై అటుగా వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అతని ఫోన్ లాక్కుపోవడానికి ప్రయత్నించారు. సాధారణంగా సామాన్యులు గనుక అప్రమత్తమైతే స్నాచింగ్ దొంగలు పరారవుతారు. కానీ అర్థరాత్రి సమయం కావడం, బాధితుడు ఒక్కడే ఉండడంతో దుండగుల చేతికి బాధితుడు ఫోన్‌ని చిక్కనివ్వని కారణంగా, అతడిపై కత్తితో దాడి చేశారు. బాధితుడు సనాఉల్లా ఛాతీపై, భుజంపై కత్తిపోట్లు పొడిచి, అతని సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. కత్తి గాయాలతో నెత్తురోడుతూ



నగరంలో రక్తపాతం

అవస్థ పడుతున్న బాధితుడిని దూరం నుంచి చూసిన స్థానికులు పరిగెత్తుకుంటూ వచ్చి, హుటాహుటీన ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే జరగాల్సిన అనర్థం జరిగిపోయింది. ఆసుపత్రికి చేరిన అనంతరం బాధితుడు అంతకు ముందే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సనాఉల్లా మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా హంతకులని ట్రేస్ చేసే దృక్కోణంలో దర్యాప్తు చేపట్టారు.

**వంట చేయలేదని ప్రాణం తీసేశారు:** బీహార్ నుంచి నగరానికి వచ్చిన స్నేహితులు తమలో ఒకడిని, తాము గదికి వచ్చిన అనంతరం అన్నం వండలేదనే కారణంతో కొట్టి చంపిన జీడిమెట్ల హత్య కేసు మరువకముందే మరో సంఘటన బాచుపల్లిలో జరిగింది.

### సామాజిక మాధ్యమాల్లో
## ఎన్నికల అంశాలను పకడ్బందీగా పర్యవేక్షించాలి

హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త: సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల అంశాలకు సంబంధించి పకడ్బందీగా పర్యవేక్షించాలని హైదరాబాద్ పార్లమెంట్ వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో గల ఛీఫ్ పీఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్నికల సందర్భంగా ఎంసిఎంసి ద్వారా చేపడుతున్న కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అడ్వర్టైజ్మెంట్, చెల్లింపు వార్తల గుర్తింపు, అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఇస్తున్న అనుమతులు, ఆయా రిజిస్టర్‌ల



ఎంసిఎంసి సెంటర్‌ను పరిశీలిస్తున్న సెంథిల్ కుమార్ తదితరులు

నిర్వాహణ తీరు తెన్నులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్ , ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో పార్లమెంట్ ఎన్నికల తో ముడిపడిన అంశాలను నిత్యం నిశితంగా పరిశీలన చేయాలని సూచించారు. బల్క్‌ఎస్ఎంఎస్‌లకు సంబంధించిన అభ్యర్థులు ఎంసిఎంసి నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఆర్ఓ ముర్తుజా అలీ, ఎక్స్‌పెండేచర్ కమిటీ నోడల్ అధికారి శరత్‌చంద్ర, సోషల్ మీడియా పర్యవేక్షిస్తున్న కమిటీ మెంబర్ డిప్యూటీ ఈఈ నరసింగరావు పాల్గొన్నారు.

# పాతబస్తీలో హోరా హోరీ ప్రచారం

## ప్రచారంలో దూసుకెళ్తున్న ఎఐఎం, బిజెపి ■ పతంగి, కమలం బిగ్‌ఫైట్



బిజెపి అభ్యర్థి కొంపల్లి మాధవీ లత



బిజెపి అభ్యర్థి కొంపల్లి మాధవీ లత



బిఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్



కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ వలీఉల్లా సమీర్

చార్మినార్, మే 1 ప్రభాత వార్త : హైదరాబాద్ పాతబస్తీలో ఎఐఎంఐఎం, బిజెపిలు ఎన్నికల ప్రచారాన్ని హోరాహోరీగా నిర్వహిస్తున్నాయి. గతంలో ఏ ఎన్నికల్లో లేని విధంగా ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో రెండు పార్టీలు విజయం కోసం పోటా పోటీగా పాదయాత్రలు, సభలు జరుపుతున్నాయి. నాలుగు సార్లు ఎంపిగా విజయం సాధించిన అసదుద్దీన్ ఓవైసీ ఐదవ సారి ఎన్నికల బరిలోకి దిగారు.బిజెపి తరుపున కొంపల్లి మాధవి లత పోటీ చేస్తున్నారు. పాతబస్తీలో ఎన్నికల ప్రచారం ఎంఐఎం,బిజెపిల మధ్య హోరా హోరీగా కొనసాగుతున్నది. ఎంఐఎంకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో పాటు నాయకులు పాదయాత్రలలో పాల్గొంటున్నారు.హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంఐఎంకు కంచుకోట. 1983 నుంచి 2019 వరకు జరిగిన ప్రతీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ విజయం సాధిస్తున్నది.2019 ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంఐఎం,బిజెపి,టిఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీలు పోటీ చేశాయి. అసదుద్దీన్ ఓవైసీ బిజెపి అభ్యర్థిపై 2,81,190 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీకి 5,17,471 ఓట్లు (58.95 శాతం) బిజెపి అభ్యర్థి డాక్టర్.భగవంత్‌రావుకు 235281 ఓట్లు (26.80 శాతం) టిఆర్ఎస్ అభ్యరి పుస్తె శ్రీకాంత్‌కు 63239 ఓట్లు (7.20),కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్ ఖాన్‌కు 49944 ఓట్లు (5.69) ఓట్లు లభించాయి.కాగా ప్రస్తుతం జరుగతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంఐఎం,బిజెపి,బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల బరిలో ఉన్నాయి. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎఐఎంఐఎం,బిజెపి పార్టీల మధ్యనే ప్రధానంగా పోటీ ఉంది. బిజెపి,ఎంఐఎం పార్టీలు పాత బస్తీలో హోరాహోరీగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. గతంలో ఎన్నడు లేని విధంగా హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎఐఎంఐఎం ఎన్నికల ప్రచారాన్ని జరుపుతున్నది.రంజాన్ మాసం ముగిసిన ఏప్రిల్ 13వ తేదీ నుంచి ఎంఐఎం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కార్వాన్,చాంద్రాయణగుట్ట,మలక్‌పేట్,బహదూర్‌పుర, చార్మినార్,యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రతీ రోజు ఉదయం పాదయాత్రలు,రాత్రి వేళల్లో బహిరంగ సభలను నిర్వహిస్తోంది.ఎంఐఎం విజయం కోసం ఆరు మంది శాసన సభ్యులు,ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇద్దరు మాజీ శాసన సభ్యులు,ముప్పై ఆరు మంది కార్పొరేటర్లతో పాటు మాజీ కార్పొరేటర్లు సైతం పాదయాత్రలు జరుపుతున్నారు.అసదుద్దీన్ ఓవైసీపై పోటీకి కొంపెల్లి మాధవిలతను బిజెపి అధిష్టానం దింపింది.మాధవి లత పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి పాతబస్తీలో జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. పాతబస్తీలో పుట్టి పెరిగిన విరుంచి ఆసుపత్రి ఛైర్మన్,బిజెపి అభ్యర్థి కొంపల్లి మాధవి లత పాతనగరంలో ఎంఐఎంకు ధీటుగానే పాదయాత్రలు జరుపుతున్నారు.ఇంత వరకు జరిగిన ఎన్నికల్లో ఒక్కసారి కూడ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బిజెపి గెలవ లేదు.రెండవ స్థానానికే బిజెపి పరిమితమైంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపి పాగా వేయటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. గోషామాల్, కార్వాన్, మలక్‌పేట్, యాకుత్‌పుర, చాంద్రాయణగుట్ట, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాలలో బిజెపి నాయకులు పాదయాత్రలు, సమావేశాలను నిర్వహిస్తున్నారు.దీంతో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంఐఎం,బిజెపిల మధ్య హోరాహోరీగా ఎన్నికల ప్రచారం కొనసాగుతున్నది. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ వలీ ఉల్లా సమీర్ పోటీ చేస్తున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మైనార్టీలు ఎక్కువగా ఉన్నందున పార్టీ అధిష్టానం ఆఖరి రోజున వలీఉల్లా సమీర్‌ను పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ వలీఉల్లా సమీర్ గత వారం రోజుల నుంచి పాతబస్తీలోని చార్మినార్,బహదూర్‌పుర, కార్వాన్,మలక్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గాలలో పాదయాత్రలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్తీలలో పర్యటించి కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పార్టీ నాయకులతో కలిసి పలు ప్రాంతాలలో పాదయాత్రలు జరుపుతున్నారు.గత ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పుస్తె శ్రీ కాంత్‌కు టిక్కెట్ వస్తుందని ఆశించారు.చివరి క్షణంలో పార్టీ అధిష్టానం యాదవ కులానికి చెందిన గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను అభ్యర్థిగా ప్రకటించిన విషయం విధితమే.

# నకిలీ ఆధారాల ముఠా గుట్టు రట్టు

**భూవిక్రయ నేరాల్లో మరో కోణం**

**ఇదెక్కడి పకడ్బందీ స్కామ్..! అనిపించక మానదు**

**అరెస్టయిన కేటుగాళ్ళు**




విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త: నకిలీ ఆధారాలతో కోట్ల విలువ చేసే ప్లాట్లను అడ్డదారిలో కొల్లగొడుతున్న ముఠా గుట్టుని సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ ఈ కేసుని వివరించారు. తెలంగాణలో భూముల విలువ పెరిగిన నేపథ్యంలో అమీన్ పురా, బందనకొమ్ము, రామేశ్వరం బండ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్లాట్లను గుర్తించిన అక్రమార్కులు, వాటి యజమానులు ఎవరో తెలుసుకుని వారి పేరుతో నకిలీ ఆధార్ కార్డులనూ, నకిలీ పత్రాలనూ, నకిలీ వంశస్థులనూ సృష్టించి స్థలాలను కాజేసి డబ్బు చేసుకుంటున్నారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన బండి దుర్గాప్రసాద్, సుబ్బారావు, రవీ గౌడ్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరు ముగ్గురూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి, అమీన్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో గత 20 నుండి 25 సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ప్లాట్లను గుర్తించి, ఆ భూముల అసల యజమానుల వివరాలను పకడ్బందీగా తెలుసుకున్నారని తెలిపారు. అనంతరం నకిలీ యజమానిని సృష్టించి అసలు యజమాని పేరు మీద నకిలీ ఆధార్ కార్డు, నకిలీ సేల్ డీడ్, లింక్ డాక్యుమెంట్లను తయారు చేసి ఆ స్థలాలు అమ్ముతూ వచ్చారన్నారు. అదే విధంగా నకిలీ వంశస్థులను సృష్టించి రెండో మార్గంగా ఆ ప్లాట్లను విక్రయించినట్లు తెలిపారు. ఇప్పటివరకూ 15 నుంచి 20 ప్లాట్ల వరకూ ఈ ముఠా అమ్మేశారని, వాటి విలువ రూ.15 కోట్లకు పైనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ స్కామ్‌లో రిజిస్టర్ కార్యాలయం వారి నిర్లక్ష్యం కూడా కీలకమైన కారణంగా పరిగణించామనీ, వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**గుట్టుగా గ్రౌండ్ వర్క్..** పోలీసుల కథనం ప్రకారం, గుట్టు చప్పుడు కాకుండా చేసే గ్రౌండ్ వర్క్‌లో భాగంగా, నిందితులు బండి దుర్గా ప్రసాద్, రవీ గౌడ్‌లు తొలుత సంవత్సరాల తరబడి ఖాళీగా ఉన్న ప్లాట్లను గుర్తిస్తారు. అనంతరం ఆ భూముల యజమానుల వయసుకి సరితూగే వ్యక్తి లేదా మహిళ కావాలని సుబ్బారావుకు సమాచారం ఇస్తారు. సుబ్బారావు అమాయక ప్రజలకు డబ్బాశ చూపించి, వారిని ఎంచుకుని చెప్పిన రోజు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చి సంతకాలు చేయాలని ఒప్పందం కుదుర్చుకుంటాడు. అనంతరం రిజిస్ట్రేషన్ చేయించి డబ్బు దండుకుంటారు. ఈ విధంగా అసలు యజమాని పేరు మీద ఇద్దరు ముగ్గురు వ్యక్తులకు నకిలీ ఆధారాలు సృష్టించి, అతడి ప్లాట్లను వేరే వ్యక్తికీ, అనంతరం మరో వ్యక్తికీ మార్చి మార్చి అమ్మేస్తుంటారు. అంతే కాకుండా నకిలీ వంశస్థులను సృష్టించే పనిలో భాగంగా అసలు యజమాని మరణించినట్లు ధృవీకరణ పత్రాన్ని సృష్టించి, యజమాని కూతురు లేదా కొడుకు పేరు మీద వేరే వ్యక్తి పేరుతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్‌ను కూడా సృష్టించి, ప్లాట్లను అమ్మి అక్రమంగా డబ్బులు సంపాదిస్తారు. ఈ ప్రెస్‌మీట్‌లో సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్‌తో పాటూ, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ కిషోర్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితర పోలీసులు పాల్గొన్నారు.

# సుర్రుమంటున్న సూరీడు

**మధ్యాహ్నం వేళ్లల్లో విరామం తీసుకుంటున్న నాయకులు**

**ఉదయం, సాయంత్ర వేళల్లోనే సభలు, సమావేశాలు**

హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త: 'మెల్లగా తెల్లారిందే అలా.. అనుకుంటూ రాజకీయ నాయకులు ప్రచారానికి పరుగులెత్తిన కొద్దిసేపటికే సూరీడు సుర్రుమంటున్నాడు. ఉదయం 7గంటలకే భగభగమండిపోతున్నాడు. దీంతో సరాసరి నాలుగు పదులు దాటే ఉష్ణోగ్రత తో రాజకీయం మరింత వేడెక్కుతుంది. ..“ప్రచారానికి సమయం తక్కువుంది బాసూ..అనుకుంటూ అభ్యర్థులు మైకులు అందుకుందామని అనుకున్నా ఎండదెబ్బతో ప్రజలను పోగు చేయడం సవాలై కూర్చుంది. అందుకే నీడపట్టున మీటింగ్ ఏర్పాట్లు చేసి టింగురంగా అనుకుంటూ తమ వాణి వినిపించేందుకు నాయకులు తాపత్రయం పడుతున్నారు. ఉదయం 11గంటల లోపే కార్యక్రమాలు ముగించుకుని మధ్నాహ్నం ఫంక్షన్ హాళ్లలోనో, ఇతరత్రా ప్రాంతాల్లో ప్రచారం కానిస్తున్నారు. మళ్ళీ సాయం సంధ్యవేళ అటు సూర్యుడు మాయం కాగానే ఇటు ప్రచార హడావిడి మొదలు పెడుతున్నారు. అదే సమయంలో చీకటి మాటునే పలు చోట్ల మందుబాబులు వెలుగులోకి వస్తుండటం కార్యకర్తలకు తలనొప్పిగా మారింది. మద్యం ప్రభావం పగ ఎండ కంటే ఘాటైన వేడి తగిలిస్తోందంటూ ప్రచారాన్ని ముగిస్తున్నారు. ఎన్నికల పర్వంలో నామినేషన్ల ,ఉపసంహారణలు ఘట్టం ముగియడంతో ప్రచారానికి పదును పెట్టడమే తరువాయిగా నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. అదినాయకులు వస్తే ఉదయం గానీ, సాయంత్రం గానీ సభలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీల వారు మధ్యాహ్నం స్థానిక సమస్యలను పర్యవేక్షించేందుకు సమయం కేటాయిస్తుంటే అధికార పక్షం వారు ఇతరత్రా కార్యక్రమాలు డిజైన్ చేసుకుంటున్నారు.



**వాతావరణ శాఖ హెచ్చరికలతో..** చాలామంది నాయకులు చల్లని వేళల్లో బస్తీలు, అడ్డా కూలీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంకొంతమంది మార్నింగ్ వాక్‌కు వచ్చి మీ ఓటు మాకే వేయాలంటూ ఏకరువు పెట్టుకుంటున్నారు. మధ్నాహ్నం వేళ ఫోన్లు చేసేద్దామనీ, సామాజిక మాధ్యమాల ప్రభావం పసిగడదామని ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఏప్రిల్ నుంచే ప్రారంభమైన ఈఎండలు ఎన్నికలు ముగిసే నాటికి ఇంకెత వేడి చూడాల్సి వస్తుందోనంటూ హైరానా పడుతున్నారు. నాలుగైదు రోజులపాటు సరాసరి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదవుతుందంటూ వాతావరణశాఖ హెచ్చరికలతో నీడలోనూ నాయకులకు చెమటలు పట్టిస్తున్నాయి. వరాల జల్లుతో ఓటరన్నను తడిసి ముద్ద చేద్దామనుకుంటే భానుడి భగభగతో తమ ఖద్దరే తడిచిపోతుందంటూ మదనపడుతున్నారు. అకాల వర్షాలు కరుణిస్తేనే తమ ప్రచారానికి మరింత సమయం దొరుకుతుందని చెబుతున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లను చుట్టి రావడమంటే అటమాటలు కాదు. నియోజకవర్గ స్థాయి సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లు, బహిరంగసభలు..ఇలా ఓట్ల వేటలో తలమూనకలైన నాయకులు ఎండలు చూసి తలలు పట్టుకుంటున్నారు.

## సిఎం రోడ్ షోతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం



రోడ్ షోలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 1 ప్రభాతవార్త:** నన్ను తిట్టడానికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏడు విమానాలు వేసుకొని తిరుగుతున్నాడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్‌షోలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని బిజెపి నాయకులు కిషన్‌రెడ్డి, ధర్మపురి అరవింద్, బండి సంజయ్, కొండ విశ్వేశ్వర్‌రెడ్డి తాకట్టు పెడితే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ మహిళలు తలుచుకుంటే బండను, కొండను ఎవరి నైనా తుక్కుతుక్కు చేస్తారని అన్నారు. పది సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఐటి. మెట్రో రైలు ఇవ్వలేదని. మూసి నది మురికి ప్రక్షాళనకు నిధులు ఇవ్వలేదని. పాలమూరు. రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేదని, రిజర్వేషన్లు రద్దుచేసి రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు బనయించడానికి ఢిల్లీ పోలీసులను దింపితే కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరు భయపడరని అన్నారు. కాంగ్రెస్ టీంతో గుజరాత్ ఫైనల్స్ పోటీ జరుగుతోందని అందులో తామే విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రోడ్‌షో కార్యక్రమంతో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, చల్లా నరసింహారెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, అనిత దయాకర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, గట్ల రవీంద్ర పాల్గొన్నారు.

## మే డే ఒక చారిత్రాత్మక దినం : జడ్జి శ్రీదేవి



న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి శ్రీదేవి తదితరులు

**వనస్థలిపురం, మే 1 ప్రభాతవార్త :** మే డే ఒక చారిత్రాత్మక దినమని, శ్రమిద్దాం, శ్రమను గౌరవిద్దామని జిల్లా న్యాయ సేవాధికారి సంసత కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మే 1 అంటే మే డే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం కానీ అమెరికాలో మాత్రం ఈ రోజును లాయల్టీ డే గా వ్యవహరిస్తారని పలు దేశాల్లో మే డే ను సెలవు దినంగా పాటిస్తారని అన్నారు. శ్రమ దోపిడిని నిరసిస్తూ యావత్ ప్రపంచ కార్మికుల స్ఫూర్తిని రగిలిస్తూ వేసిన ముందడుగే మే డే అన్నారు. అనంతరం అంకిత సంస్థ ఆధ్వర్యంలో అర్హులైన వారికి లేబర్ కార్డులను జడ్జి చేతులమీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మం, ఎంఇఓ హీర్యానాయక్, డాక్టర్ బిగాగ్ అహ్మద్, దేవేంద్రచారి, తౌఫీఖ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ చౌరస్తాలో మే డే వేడుకలు



మేడే సందర్భంగా కార్మిక జెండాను ఆవిష్కరించిన తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, మే 1 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తాలో బుధవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మరో ముఖ్య అతిథి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర పట్టణ మౌళిక సదుపాయాల ఆర్థిక సంస్థ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డితో కలిసి మేడే జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎరుకల వెంకటేశ్‌గౌడ్, సిద్దాల శ్రీశైలం, జె.రవినాయక్, మాదరి శ్రీనివాస్, సిద్దేశ్వరచారి, సురేష్, స్వామి, వీరయ్య, జంగయ్యలతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## సమస్యలపై పోరాటాలు చేయాలి : సిఐటియు




మే డే వేడుకలను నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

**తుర్కయంజాల్, మే 1 ప్రభాతవార్త :** మే డే స్ఫూర్తితో కార్మికులు తమ సమస్యలపై పోరాటాలు చేయాలని ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఒరుగంటి యాదయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. 138వ మే డే దినోత్సవ సందర్భంగా తుర్కయంజాల్ చౌరస్తాలో ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, కార్మికులకు కనీస వేతనాల చట్టాన్ని అమలుచేయకుండా మోడీ నీరుకార్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. శివకుమార్, ఏఐటీయూసీ నాయకులు కాటంరాజు, శివ, గువ్వల రాజు, యాదగిరి, భాస్కర్, ఆనంద్ సుందరమ్మ, మల్లేష్, శ్రీకాంత్, విజయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**డి.కిషన్ అధ్యక్షతన...** తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాలు మరియు పరిశ్రమల కార్మికులు పెద్ద ఎత్తున జెండాలు ఎగరవేసి మేడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుర్కయాంజాల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం నుండి రొక్కం సత్తిరెడ్డి కళ్యాణ మండపంవరకు కార్మికులు ఉద్యోగులతో భారీ ప్రదర్శన నిర్వహించి హాల్‌ముందు జెండావిష్కరణ చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షులు డి.కిషన్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కార్మికులు శ్రమిస్తే వచ్చే అదనపు లాభం ద్వారానే పెట్టుబడుదారులు సంపద పోగేస్తున్నారని కార్మికుల ద్వారా వొచ్చే అదనపు విలువ కార్మికులకు పంపిణీ జరగాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. సత్యనారాయణ, ప్రకాష్ కరత్, కె.అరుణ్ కుమార్, భాస్కర్, శంకర్, వెంకట కృష్ణ, శంకరయ్య, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక



వెంకటేశ్వర్‌రెడ్డికి పార్టీ కండువా కప్పుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

**వనస్థలిపురం, మే 1 ప్రభాతవార్త :** ఎల్‌బినగర్ నియోజకవర్గం వనస్థలిపురం డివిజన్ బిజెపి పార్టీ కార్పొరేటర్ రావుల వెంకటేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమమని, కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమానికి ఆకర్షితులై పీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కిగౌడ్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజ శేఖర్ రెడ్డి, పట్లోళ్ల మాధవరెడ్డి, ఎల్బీనగర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, మెరుగు రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల చదువుకై వైఆర్‌పి ఫౌండేషన్ కృషి : చైర్మన్ రవిప్రసాద్



విద్యార్థులను సన్మానిస్తున్న రవిప్రసాద్

**ఎల్.బి.నగర్, మే 1 ప్రభాతవార్త :** సమాజంలోని పేద విద్యార్థుల విద్యాభ్యాసం కోసం వైఆర్‌పి ఫౌండేషన్ చేయూతను అందిస్తుందని వైఆర్‌పి సంస్థ చైర్మన్ ఎలిషాల రవిప్రసాద్ పేర్కొన్నారు. వైఆర్‌పి ఫౌండేషన్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆర్కేపురంలోని ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం విద్యార్థినీ, విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవిప్రసాద్ మాట్లాడుతూ సమసమాజం కోసం యువతకు ఆర్థికంగా సహాయం చేస్తూ వారిలో ధైర్యం నింపుతూ విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా పేద విద్యార్థులు విద్యావంతులుగా ఎదగడానికి ఫౌండేషన్ నిర్విరామంగా కృషి చేస్తుందని తెలిపారు. ఫౌండేషన్ ద్వారా దాదాపు ఇంటర్మీడియట్ 28 మంది విద్యార్థులకు ఫీజులు చెల్లించి వారు చదువుకోడానికి ఫౌండేషన్ సహాయం చేసిందన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా చదువుకున్న బొడ్డు నవీన్‌సాయి అనే విద్యార్థి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం సాధించడం పట్ల అభినందించారు. పదో తరగతిలో 12 మంది విద్యార్థులు ఫౌండేషన్ ద్వారా ఆర్థిక లబ్ధిపొంది 9.5 గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించారు అని తెలిపారు. భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు సహాయం చేసేందుకు తమ ఫౌండేషన్ ఎప్పుడు ముందుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో శరత్‌చంద్ర, హేమచంద్ర, ఎడ్ల కృష్ణారెడ్డి, చకిలం శేషగిరిరావు, మురిశెట్టి శ్రీనివాస్, షణ్ముఖం, దయాకర్, వాసు, సిబ్బంది శాంతి, శ్రీదేవి పాల్గొన్నారు.

## మలక్‌పేటలో రూ. 1.68 కోట్లు స్వాధీనం

**మలక్‌పేట, మే 1 ప్రభాతవార్త :** సరైన ధృవ పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం దిల్‌సుక్‌నగర్ బస్టాప్ వద్ద మంగళవారం రాత్రి మలక్‌పేట పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో నిబంధనలకు వ్యతిరేకంగా రూ. 1.68 కోట్ల నగదును తరలిస్తుండగా పోలీసులు గమనించి నగదుకు సంబంధించి సరైన ధృవపత్రాలు చూపించకపోవడంతో రూ. 1.68 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదును ఎన్నికల కమిషన్ వారికి అందజేయడం జరిగిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## ఉద్యోగుల సంక్షేమానికి కృషి : మేనేజర్ హరి



ఉద్యోగులను అభినందిస్తున్న డిపో మేనేజర్ హరి తదితరులు

**మలక్‌పేట, మే 1 ప్రభాతవార్త :** ఉద్యోగుల సంక్షేమానికి ఎళ్లవేళలా కృషి చేస్తామని దిల్‌సుక్‌నగర్ ఆర్టీసి డిపో మేనేజర్ హరి పేర్కొన్నారు. డిపోలో జరిగిన కార్యక్రమంలో ఫిబ్రబరి, మార్చి నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ఆయన అవార్డులను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో ఉద్యోగులు, సిబ్బంది పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐ వెంకన్న, ఎంఎఫ్ వెంకటేష్, సోలిపురం బుచ్చిరెడ్డి, ఎ.ఎస్.రెడ్డి, జి.ఎన్.రెడ్డి, ఎంవిఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మరో ప్రపంచ స్వాప్నికుడు శ్రీ శ్రీ : ఉప్పల



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, మే 1 ప్రభాతవార్త :** మరో ప్రపంచ స్వాప్నికుడు శ్రీశ్రీ తెలుగు సాహిత్యంలో మహ ప్రస్థానం శ్రీశ్రీని శిఖరాగ్ర కవిగా నిలిపిందని, మరో ప్రపంచ స్వాప్నికుడు శ్రీశ్రీ అని రాష్ట్ర పర్యటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ 115వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాసగుప్త హాజరై మాట్లాడుతూ భావకవిగా, విప్లవ కవిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన శ్రీశ్రీ సంప్రదాయ కవిత్వానికి భిన్నంగా వాడుక భాషలోని పదాలతో గొప్ప భావాలను పలికించారన్నారు. సినీకవిగా ఎన్నో ఆణిముత్యాలలాంటి పాటలను అందించారని అయన రాసిన కలకానిది విలువైనది, తెలువీరలేవరా లాంటి గీతాలు చిర స్మరనీయాలు అంటూ ప్రస్తుతించారు. గౌరవఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీకవి, దర్శకుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ శ్రీశ్రీ జీవిత పరిచయం చేస్తూ ఆయన రాసిన కావ్యాలను, కమనీయ సినీ గీతాలను విశ్లేషించి ప్రస్తావించారు. అరవై అయిదు ఏళ్ల క్రితం ఆయన రాసిన పాడవోయి భారతీయుడా పాటలోని అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు, అలుముకున్న ఈ దేశం ఎటు దిగజారు, పాట ఇప్పటి పరిస్థితుల్లో కూడా అన్వయం కావడం ఆయన దూరదృష్టికి అద్దం పడుతుందని కీర్తించారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కోర్టు సొసైటీ అధ్యక్షుడు బాజిరెడ్డి శాయిరెడ్డి, బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులు పిల్లలమర్రి రమేష్, సీనియర్ పాత్రికేయులు రామ చంద్రరావు, మదర్‌థెరిసా ఫౌండేషన్ అధ్యక్షుడు చేపూరి శంకర్, పలువురు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్ విద్యావతి



పార్టీలో చేరిన నాయకులతో మల్‌రెడ్డి రంగారెడ్డి

**హయత్‌నగర్, మే 1 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అవినీతి రహిత పాలనకు ఆకర్షితులై బీఆర్ఎస్ నుంచి పెద్దఎత్తున పార్టీలో చేరుతున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డి, బాటసింగారం రైతుసేవా సహకార సంఘం డైరెక్టర్ ఇటుకల మహేందర్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సత్తార్‌లు 300 మంది నాయకులు, కార్యకర్తలతో బుధవారం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మల్‌రెడ్డి రంగారెడ్డి తన నివాసంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ స్వప్నచిరంజీవి, కౌన్సిలర్లు సిద్దంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, పండుగుల జయశ్రీరాజు, నాయకులు గంట శ్రీనివాస్‌రెడ్డి, దండెం రాజశేఖర్‌రెడ్డి, మజ్జిగ లక్ష్మారెడ్డి, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు



కార్మికులతో కలిసి జెండాను ఎగురవేసిన సిఐటియు అధ్యక్షుడు దాసరి బాబు

**సరూర్‌నగర్, మే 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బుధవారం మేడే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాలాపూర్ మండల సిఐటియు అధ్యక్షుడు దాసరి బాబు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో మేడే జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా ఉండి హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికులు తమకు జరిగే అన్యాయాలను ఎదురించాలని తాము అండగా నిలబడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిఐటియు అధ్యక్షుడు యాదగిరి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ రవి, మున్సిపల్ సూపర్‌వైజర్లు దాసరి రంజిత్, గొట్టె బాలకృష్ణ, దాసరి జీవన్, రాజిరెడ్డి, సిఐటియు నాయకులు యాదగిరి చారి, ధనంజయ, వేణుమాధవ్‌లతో పాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో ఘనంగా మే డే వేడుకలు



జెండాను ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు రొయ్యల క్రిష్ణమూర్తి..

**నేరెడ్‌మెట్, మే 1 ప్రభాతవార్త:** కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించడమే దిశగా తాము ఎల్లప్పుడు పనిచేస్తామని మల్కాజిగిరి నియోజకవర్గ సీపిఐ కార్యదర్శి రొయ్యల క్రిష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం మే డే సందర్భంగా ఏఐటియూసి సీపిఐ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఎర్ర జెండాను ఎగురవేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు చేయాలని డిమాండ్ చేసారు. అంతేకాకుండా ఉపాధి హామీ కూలీల వేతనం సైతం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపిఐ, ఏఐటియూసి నాయకులు యాదయ్య గౌడ్, అశోక్, నాగరాజు, ఆనంద్‌రాబు, వెంకటరమణ, వెంకటేష్ గౌడ్, దుర్గారావు, సుధాకర్, పరుశరామ్, ఆటో ట్రాలీ యూనియన్ నాయకులు బీరప్ప, రమేష్, కామేష్, రాజు, రవి, నవీన్, సిద్దులు, వెంకటేష్, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, మే 1 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, 24వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో మేడే వేడుకలను పురస్కరించుకొని మున్సిపల్ కార్మికులకు సన్మానం చేశారు. స్థానిక వార్డు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అల్మాస్‌గూడ పాత గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, కామాటీలు, ప్లంబర్లు, వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్లు తదితరులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల అందించే సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తిగా కార్మిక చట్టాల అమలు కోసం కార్మికులు పోరాటం చేయాలి



మేడే ఉత్సవాలలో యాదిరెడ్డి, నాయకులు

**హయత్‌నగర్, మే 1 ప్రభాతవార్త:** ఎంతో మంది అమరవీరుల త్యాగాల ఫలితంగా కార్మికులు మేడేను నిర్వహించుకుంటున్నారని... దీనిని స్ఫూర్తిగా తీసుకుని పెట్టుబడిదారి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. మేడేను పురస్కరించుకుని ఏఐటీయూసీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి హరిసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 12 శాఖలతో కలిసి గ్రామ గ్రామాన కార్మిక సంఘం పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పొన్నాల యాదగిరి, కేతరాజు నరసింహ, దాసరి ప్రసాద్, వేణుగోపాలచారి, నర్సింహ పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి, కేసీఆర్ మాటలు ఎవరు నమ్మరు : అందెల శ్రీరాములుయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న అందెల శ్రీరాములుయాదవ్, రాధాధీరజ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 1 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరని మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి అందెలా శ్రీరాములుయాదవ్, ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఎన్టీఆర్‌నగర్లో రేవంత్‌రెడ్డి బిజెపిపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ బుధవారం ఆర్కేపురం డివిజన్ బిజెపికార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో ఎన్టీఆర్‌నగర్ సమస్య పరిష్కరిస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సమక్షంలో ప్రజలకు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కొత్తగా వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్లో ఎన్టీఆర్‌నగర్ సమస్యను పరిష్కరించాలంటే 20వేల ఓట్ల మెజారిటీ ఇవ్వాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటు అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ ఓడిపోతే ఎన్టీఆర్‌నగర్ సమస్యను సెక్రెటరేట్లో పరిష్కరించారని వారు ప్రశ్నించారు. దేశంలో బిజెపికి 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు పోవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ మాత్రం తప్పకుండా పోతుందన్నారు. మహేశ్వరం, ఎన్టీఆర్ నగర్ సమస్యలపై అవగాహన లేక ముఖ్యమంత్రి గాలి మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ గుజరాత్ పాలన అందించడం లేదని భారత్ పాలన అందిస్తున్నారని విషయాన్ని ఇటలీ రాజకీయం చేస్తున్నవారు గుర్తుంచుకోవాలన్నారు. భారతదేశ ప్రజలే కుటుంబమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు రాములుయాదవ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## లెనిన్‌నగర్ సిపిఐ కార్యాలయంలో ఘనంగా మే డే వేడుకలు



మేడే వేడుకలను నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

**సరూర్‌నగర్, మే 1 ప్రభాతవార్త:** మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి పిలుపునిచ్చారు. సిపిఐ బాలాపూర్ మండల సమితి, ఏఐటియుసి ఆధ్వర్యంలో లెనిన్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం మేడే ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన ఏఐటియుసి జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ కార్మికుల ఎన్నో యేండ్ల పోరాటాల ఫలితమే రోజుకి ఎనిమిది గంటల పని గంటల విధానాన్ని సాధించుకోవడం జరిగిందని అన్నారు. తమ హక్కుల పట్ల కార్మికులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, డి.దశరథం, పిచ్చిరాజు, దేరంగుల శంకరయ్య, ఎన్.నారాయణ, వీరస్వామి, అంజయ్య, శత్రు నాయక్, రాంచంద్రయ్య, యాదమ్మ, లక్ష్మమ్మ, సీత, జయమ్మ, రామస్వామి, జర్పుల శివనాయక్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష ఫలితాలలో నాగార్జున విద్యా సంస్థల విద్యార్థుల సత్తా



కచేరి నిర్వహిస్తున్న దృశ్యం

**వనస్థలిపురం, మే 1 ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్ష ఫలితాలలో నాగార్జున విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి మరో సారి సత్తా చాటారని విద్యా సంస్థల అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్ తెలిపారు. జీ.పి.ఏ 10కి 10 పాయింట్లు 50 మంది విద్యార్థులు, 9.8 పాయింట్లు 72 మంది, 9. పాయింట్లు 73 మంది, 9.5 పాయింట్లు 71 మంది 9.0 పాయింట్లకు మించి 50 మంది సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులకు పుష్ప గుచ్చాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, ఇన్‌ఛార్జులు, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## గాయత్రినగర్ బ్యాంక్ కాలనీలో ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు



కార్మికులకు దుస్తుల పంపిణీ చేస్తున్న మధుయాష్కి, లక్ష్మీప్రసన్న తదితరులు

**వనస్థలిపురం, మే 1 ప్రభాతవార్త:** మే డే ను పురస్కరించుకుని బి.ఎన్.రెడ్డి డివిజన్ గాయత్రినగర్, బ్యాంక్ కాలనీ కాలనీవాసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా మధుయాష్కిగౌడ్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్నలు హాజరై కార్మిక జెండా ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ సమాజంలో కార్మికుల పాత్ర అతి కీలకమైనదని, కార్మికుల శ్రమతోనే పరిశ్రమల, ఆహార ఉత్పత్తులు, ఇళ్ళు, రోడ్ల నిర్మాణం, పారిశుధ్యం లాంటివన్నీ సాధ్యపడతాయని, అటువంటి కార్మిక శక్తిని గుర్తించి సమాజం వారిని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కాలనీ వాసులందరూ కలిసి వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులను గౌరవిస్తూ వారికి దుస్తులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, భావన శ్రీనివాస్, సాయిమందిర్ కమిటి ఛైర్మన్ మారుతమ్మ, సరస్వతి, కాలనీ మాజీ అధ్యక్షులు భవాని, భద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, ఉపేందర్, మనోహర్, ఇసాక్, దుర్గేష్, భిక్షమయ్య, జీవన్ గౌడ్, చంద్రశేఖర్, మహిళలు పాల్గొన్నారు.